రేపు గరీబ్ గైడ్ కమిటీ రాక

జలుమూరు : ఈనెల 26వ తేదీన జిల్లాకు గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ కమిటీ సభ్యులు పర్యటించనున్నట్లు సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ డి.వి రావు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు ధిక్కరణ కేసు, కాకర్ల చెరువు, రాజుల చెరువు తదితర కేసులు తుది దశకు చేరుకోవడంతో కోర్టుకు వాస్తవాలు తెలియజేయాలని పిటిషనర్ గరీబ్ గైడ్ సూచనల మేరకు ఐదుగురు సభ్యుల కమిటీని (సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ డివిరావు అధ్యక్షతన) నియమించింది. జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలను తమ దృష్టికి తీసుకురావాలనుకుంటున్న వారు ఉచిత న్యాయ సహాయం కావాలనుకుంటున్న వారు 26న మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 9618536666, 9180456789 ఫోన్ నంబర్లలో తమను సంప్రదించాలని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన విషయాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

మమ్మల్ని అడిగేదెవరు..?

బూర్జ మండలం డొంకలపర్తకు చెందిన బి.సూర్యనారాయణ మూడు ఎకరాల్లో వరి వేశాడు. యూరియా కోసం రైతుభరోసా కేంద్రానికి వెళ్లి ఎరువులు అడగ్గా లేవన్నారు. దీంతో కురిమిపేటలోని ఒక ఎరువుల దుకాణం దగ్గరకు వెళ్లాడు. బస్తా రూ.330 చొప్పున ఎనిమిది బస్తాలు కొనుగోలు చేశాడు. రైతు భరోసాలో యూరియా లభ్యమై ఉంటే బస్తా రూ.270కే దొరికేది.

ఇదే మండలం బువ్వపేటకు చెందిన రైతు మన్మథరావుకూ ఇదే అనుభవం ఎదురైంది. యూరియా కోసం బూర్జ వెళ్లాడు. బస్తా రూ.270కు దక్కాల్సిన యూరియాను రూ.330కు కొనాల్సి వచ్చింది. పైగా గడ్డిమందు కొంటే గానీ యూరియా ఇవ్వబోమని వ్యాపారులు చెప్పడంతో, చేసేది లేక అవసరం లేకపోయినా మందును కొనుగోలు చేశాడు.

ఎరువులను ప్రయివేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సి రావడం, డీలర్లు అధిక ధరలకు విక్రయించడం ఈ మండలానికే పరిమితం కాలేదు. జిల్లావ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

- జిల్లాలో పలుచోట్ల అధిక ధరలకు ఎరువుల విక్రయాలు
- గడ్డి మందు కొంటేనే యూరియా
- పలువురు వ్యాపారుల షరతులు
- తనిఖీలు మరిచిన వ్యవసాయశాఖ అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి / బూర్జ

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల సాగు లక్ష్యం కాగా, ఇప్పటివరకు సుమారు 2.60 లక్షల ఎకరాలకు పైగా పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 2.20 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఖరీఫ్ అవసరాలకు జిల్లాకు 54 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అందులో ఇప్పటివరకు 38 వేల మెట్రిక్ టన్నులు వచ్చిందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. ఇందులో సుమారు 50 శాతం ప్రయివేట్ డీలర్లకు ఇచ్చారు. జిల్లాలో ఉన్న 596 ఆర్‌బికెలకు 19,900 మెట్రిక్ టన్నులు ఇవ్వగా, మిగిలిన 18,100 మెట్రిక్ టన్నులను ప్రయివేట్ డీలర్లకు ఇచ్చారు. జిల్లాలో ఆరుగురు హోల్‌సేల్ డీలర్లు ఉన్నారు. రిటైల్ వ్యాపారులు 250 మంది వరకు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. అనుమతులు లేకుండా దొంగచాటుగా విక్రయాలు సాగిస్తున్న వారు సుమారు 600 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. హోల్‌సేల్, రిటైల్ డీలర్ల నుంచి సరుకును తెచ్చి యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలు స్తోంది. హోల్‌సేల్ వ్యాపారులు కొంత అదనంగా ధర వేసుకుని రిటైల్, ఇతర వ్యాపారులకు ఇస్తు న్నారు. వీరు దానికి అదనంగా మరింత లాభం కలుపుకొని రైతులకు అమ్ముతున్నారు. వ్యాపారులు తెచ్చిన సరుకు కొన్నిచోట్ల అమ్ముడుపోకపోవడంతో ఎరువుల అమ్మకాలను గడ్డి, పురుగుమందులను అంటగడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బూర్జ మండలం కురుమిపేటలో యూరియా బస్తాలను ఆటోలోకి ఎక్కిస్తున్న రైతులు

వ్యాపారులు, అధికారుల కుమ్మక్కు?

ఎరువుల అమ్మకాలకు సంబంధించి వ్యాపారులు, అధికారులు కుమ్మక్కయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎరువులు అధిక ధరలకు విక్రయించడం ప్రతి ఏడాదీ జరుగుతున్నదే అంటూ చాలా తేలిగ్గా తీసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎరువులు అధిక ధరలకు విక్రయించడం, అనుమతించిన దానికంటే అధిక మొత్తంలో నిల్వలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు, వ్యాపారుల జోలికే వెళ్లడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. ఒక మండలంలోని వ్యవసాయశాఖ అధికారులు వేరే మండలానికి వెళ్లి తనిఖీలు చేసేలా కమిటీలు ఏర్పాటు చేసినా, ఎక్కడా తనిఖీలు నిర్వహించిన పాపాన పోలేదు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లోనూ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దుకాణాలపై దాడులు నిర్వహించాలని ఆదేశించినా వ్యవసాయశాఖ అధికారులు స్పందించడం లేదు. దీంతో వ్యాపారుల చెప్పిందే ధరగా నడుస్తోంది. జిల్లా అధికారులు స్పందించి ఎరువుల ధరలను నియంత్రించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

హోల్‌సేల్ దుకాణాల నుంచి రిటైల్ షాపులకు పంపిణీ సందర్భంలో కొన్ని ఇబ్బందులు రావచ్చు. అనుమతులు లేకుండా ఎరువులను విక్రయించకూడదు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటాం. ఎరువుల దుకాణాల్లో తనిఖీల కోసం కమిటీలు నియమించాం. గడ్డి, పురుగుమందులను రైతులు ఒప్పుకుంటే ఇవ్వాలని చెప్పాం. బలవంతంగా కట్టబెట్టొద్దని సూచించాం.

- కె.శ్రీధర్, వ్యవసాయశాఖ జెడి

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మన్యం జిల్లా అటవీ శాఖ రేంజర్ రాజశేఖర్

గొర్రెను చంపిన పులి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మన్యం జిల్లా డివిజన్ రేంజర్ రాజశేఖర్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలంలోని అమృతలింగానగరం పరిధిలోని జగనన్న కాలనీ వద్ద గొర్రెల మందలోని ఒక గొర్రెను పులి చంపి, మరో గొర్రెను మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లింది. గోనెపాడుకు చెందిన గొర్రెల పెంపకందారుడు మల్లేశ్వరరావు స్థానికులకు విషయం చెప్పడంతో వారు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖ డివిజన్ రేంజర్ రాజశేఖర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సంచరించిన పులి అడుగులు... ఇక్కడ సంచరించిన పులి అడుగులు ఒక్కటేనని తమ పరిశీలనలో తేలిందని స్పష్టం చేశారు. కొత్తూరు మండలం గులివిందలపేట ప్రాంతంలో బుధవారం సంచరించిన పులి, గురువారం సరుబుజ్జిలి మండలానికి చేరుకున్నట్లు గుర్తించామన్నారు. ఇది బెంగాల్ టైగర్ అని.. ఐదేళ్ల వయసు, 180 నుంచి 250 కేజీల బరువు, ఎనిమిది అడుగుల ఎత్తు ఉంటుందని వివరించారు. ఇది వేకువజామున, ఉదయం పూట ఎక్కువగా ప్రయాణం చేస్తుంటుందని తెలిపారు. వేకువజామున పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడికి వెళ్లినా గుంపులు గుంపులుగా వెళ్లాలన్నారు. గొర్రెను పోస్టుమార్టం కోసం పంపించామని, నివేదిక రావాల్సి ఉందన్నారు. పులి వెన్నెలవలస దాటి సీతంపేట వైపు వెళ్లి ఉంటుందని, అక్కడ్నుంచి ఒడిశా వైపు వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఆప్కాస్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు మున్సిపాల్టీల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫెడరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. దుమ్ము, ధూళి, దుర్గంధం భరిస్తూ అనారోగ్యం బారిన పడుతూ పట్టణాలు, నగరాల పరిశుభ్రతకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో, పాదయాత్రలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులపై సానుకూలంగా మాట్లాడి ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారన్నారు. ఆరు నెలల్లో పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి శాశ్వత బానిసలను చేశారని చెప్పారు. దళారీ వ్యవస్థ ద్వారా క్లాప్ డ్రైవర్లను నియమించి కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వారికి రూ.18,500 కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కళ్యాణ రాజు, ఎ.గురుస్వామి, ఆకుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంతో ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. మండలంలోని గాజులకొల్లివలసలో సంగమయ్య కొండ దిగువన వేసిన సైకత శిల్పాన్ని వీక్షించిన వారంతా హరికృష్ణను అభినందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో గురువారం క్యాంపస్ కాప్స్ రెండో విడత శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్యాంపస్ కాప్స్ శిక్షణలో నేర్చుకున్న చట్టాలు, నాయకత్వ లక్షణాలు, సైబర్ నేరాల నియంత్రణ తదితర అంశాలను మరో పది మందితో పంచుకోవాలని సూచించారు. చదువుతోపాటు విద్యార్థులకు సమయపాలన, స్కిల్ డెవలప్‌మెంట్, నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడు ఉన్నతమైన పౌరులుగా రూపుదిద్దుకుంటారని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. క్యాంపస్ కాప్స్ పోలీసింగ్ విధానం నేటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలు జీవితంలో చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో యువతకు చట్టాలపై అవగాహన అవసరమన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జెసికి ఎఎస్‌పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డిఎస్‌పి వై.శ్రుతి, ఎల్.సన్యాసినాయడు, ఎస్ఐలు గణేష్, లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వాంతరం దాటిన దేశ కీర్తి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

చంద్రయాన్-3 విజయవంతం కావడంపై ఇస్రో శాస్త్రవేత్తలకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అభినందనలు తెలిపారు. 140 కోట్ల భారతీయ ప్రజానీకం ఆకాంక్షలు నెరవేరాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ చరిత్ర పేజీల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన దినంగా కొనియాడారు. భారతదేశానికి ఇంతటి ఘనకీర్తి తెచ్చిన ఇస్రో శాస్త్రవేత్తలు భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శాస్త్రవేత్తలకు అవసరమైన వనరులు సమకూర్చడంతోపాటు తగిన ప్రోత్సాహం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారతదేశంలో మేధావులు, విజ్ఞానవంతులకు కొదవలేదని ప్రపంచానికి ఈ ఘటనతో నిరూపితమైందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లాలో అర్హత కలిగి పలు కారణాలతో సంక్షేమ పథకాలు అందుకోలేని 6,995 మంది లబ్ధిదారులకు రూ.7.09 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాలకు జమ చేసిందని తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సాంకేతిక, ఇతర కారణాల వల్ల అందుకోలేకపోయిన వారిని గుర్తించి నిధులు విడుదల చేసినట్లు చెప్పారు.

సోషల్ ఆడిట్ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించి, పారదర్శకతతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొందర, కూరాకుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ.అనురాధ, బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మ, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేనేతను ప్రోత్సహించాలి

- 28 వరకు వస్త్రాల విక్రయాలు
- విరివిగా కొనుగోలు చేయాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చేనేత కార్మికులు తయారు చేసే వస్త్రాలను జిల్లా ప్రజలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యాన చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలను నగరంలోని వైఎస్ఆర్ మున్సిపల్ కళ్యాణ మండపంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జిల్లా చేనేత వస్త్రాలకు మంచి పేరుందన్నారు. జిల్లా ప్రజలే చేనేత కార్మికులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికారులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించుకొని స్పందనకు హాజరు కావాలని చెప్పారు. జిల్లాలో నాలుగు క్లస్టర్లకు రూ.నాలుగు కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. దేశంలో వ్యవసాయం తర్వాత అతి పెద్ద వృత్తి చేనేత రంగమన్నారు. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. చేనేత కార్మికులు తయారు చేసే వస్త్రాలకు మార్కెటింగ్ ప్రధాన సమస్య అని, ఈ సమస్యను అధిగమించి కార్మికులను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఇటువంటి వస్త్ర ప్రదర్శనలను ఏర్పాటు చేసి విక్రయించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు 20 స్టాల్స్ ద్వారా వస్త్ర ప్రదర్శనతో పాటు విక్రయాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజలు విరివిగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేయూతనందించాలని పిలుపునిచ్చారు.

చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు మాట్లాడుతూ పొందూరు, అంపోలు, కొరసవాడ, అక్కులపేట, తోలాపి, అలికాం, సింగుపురంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన పొందూరు ఖద్దరు, జమదానీ కాటన్ చీరలు, కాటన్, సిల్క్, సాదాచీరలు, మంగళగిరి, డ్రెస్ మెటీరియల్స్, కలంకారీ వస్త్రాలు, తువ్వాళ్లు, లుంగీలు తదితర చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. తక్కువ ధరకే లభించే వస్త్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిపిఆర్ఒ కె.బాలమాన్ సింగ్, డెవలప్‌మెంట్ అధికారులు ఆర్.శేఖర్, ఎస్.శ్రీను, ఎండిఒ ఇ.రమేష్, పలు సహకార ఉత్పత్తి విక్రయ సంఘాల అధ్యక్షులు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రాట్నం వడుకుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పిల్లల ప్రవర్తనపై పరిశీలన అవసరం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పిల్లల ప్రవర్తనను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన పలు శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చిన్నపిల్లల్లో మంచి ప్రవర్తన, సోదరభావం, దేశభక్తి చిన్నతనం నుంచే పెంపొందించే దిశగా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. పిల్లల ప్రవర్తనను ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు అనుక్షణం గమనిస్తూ వారిలో చిన్న తేడా కనిపించినా వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే అవి పిల్లల ప్రవర్తనా లోపాలుగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. పిల్లల్లో సత్ప్రవర్తన పెంపొందించడానికి తగిన సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జువైనల్ జస్టిస్ మెజిస్ట్రేట్ శారదాంబ, మొబైల్ మెజిస్ట్రేట్ శ్రీవిద్య, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి రమణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జయహో భారత్

కవిటి : విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పలాస : చంద్రయాన్-3 అక్షర రూపంలో కూర్చున్న విద్యార్థులు

శ్రీకాకుళం : మాట్లాడుతున్న రాధాకృష్ణ

సోంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న 'భారతి' విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

జయహో భారత్ అంటూ విద్యార్థులు నినదించారు. కవిటి పురవీధుల్లో ఊరేగుతూ భారత్ శాస్త్రవేత్తల ఖ్యాతిని కొనియాడారు. చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 నమూనాతో కవిటిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కవిటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇస్రో, ఇండియా ఆకారంలో విద్యార్థులు మానవహారం చేపట్టారు. ముఖ్య అతిథి, విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయుడు పండి బలరామమూర్తి ఇస్రో పనితీరు, చంద్రయాన్ విజయవంతంలో శాస్త్రవేత్తల కృషి, కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతికత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా రాము టీచర్ చేసిన చంద్రయాన్-3 నమునా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిందు మాధవి, బల్లెడ రమేష్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సాయిప్రియదర్శిని ఎడ్యుకేషనల్ సొసైటీలో నడుపుతున్న విశాఖ స్కూల్ చంద్రయాన్-3 చంద్రునిపై కాలు మోపి చరిత్ర సృష్టించిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ఇండియన్ ఆర్మీ కాలింగ్ సౌజన్యంతో బ్యాంకర్స్‌కాలనీ నుంచి రామలక్ష్మణ కూడలి, అక్కడ నుంచి సూర్యమహల్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. జయహో స్లోగన్స్‌తో ఇస్రో బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రయాన్-తో మొదలుపెట్టి నేటి చంద్రయాన్-3 వరకు వివరిస్తూ... ఈ విషయం వెనుక ఉన్న ఇస్రో శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. ఇటువంటి విజయాలు ఇంకెన్నో సాధించి భారతదేశ ఖ్యాతిని కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు పి.రామారావు, ఉపాధ్యాయులు, ఐఎసి డైరెక్టర్ డి.వి.రమణ పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్య...

భారతదేశ అంతరిక్ష సంస్థ (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్-3 చంద్రునిపై విజయవంతంగా కాలుమోపి కొత్త చరిత్రకు నాంది పలికిందని కాకినాడ శ్రీఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు 300 మంది విద్యార్థులతో విజయహర్ష ధ్వానాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. తమ విద్యార్థులందరిలో ఈ చంద్రయాన్-3 ఒక మంచి స్ఫూర్తి నింపుతుందన్నారు. ప్రతి విద్యార్థిలోనూ సైన్స్‌పై ఒక జిజ్ఞాసకు కలిగించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు, సెక్రటరీ సుగుణారెడ్డి పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతం కావడం అభినందనీయమని, మున్ముందు ప్రపంచంలో మేటి భారత్ అని గర్వంగా చాటి చెప్పాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. నగరంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి అంబేద్కర్ కూడలి వరకూ సాగింది. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పి.జి.గుప్త, శాసపు జోగినాయుడు, బి.వి.రవిశంకర్, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, బి.దేవీప్రసాద్, ఎం.మల్లిబాబు, ఇండియన్ ఆర్మీ కాలింగ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : మిషన్ చంద్రయాన్-3లో భాగంగా పంపిన విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా చంద్రునిపై కాలుమోపడం మన శాస్త్రవేత్తలు సాధించిన గొప్ప విజయమని మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి.రాధాకృష్ణ అన్నారు. నగరంలోని స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమంలో మిషన్ చంద్రయాన్-3పై అవగాహన కల్పించారు. అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, హిస్టరీ అధ్యాపకులు ఎన్.చిన్నారావు పాల్గొన్నారు.

సోంపేట : చంద్రయాన్-3 విజయవంతపై సంస్కార భారతి విద్యా సంస్థల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ దాసు, చైర్మన్ దేవరాజు, డైరెక్టర్ శ్రీనుబాబు, ప్రిన్సిపాల్ బి.శ్రీరామ్మూర్తి, బి.కవిబాబు, ఎఒ పాపారావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు మహర్షి విద్యానికేతన్, వివేకానంద విద్యా కేంద్ర శిశుమందిర్, శ్రీకుమార్ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులంతా జాతీయ పతాకాలను పట్టుకొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : చంద్రయాన్-3 విజయవంతంపై పట్టణంలోని స్వర్ణభారతి, శాంతినికేతిన విద్యా సంస్థల విద్యార్థులు పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణభారతి విద్యా సంస్థ చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే శాంతినికేతన్ విద్యా సంస్థల చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణభారతి విద్యాసంస్థల కో-ఆర్డినేటర్ చాట్ల నీలమరెడ్డి, ప్రిన్సిపాల్ ఆసి గౌరీశంకర్, ఉపాధ్యాయులు రమేష్, శాంతినికేతన్ విద్యా సంస్థల అధ్యాపకులు కె.సి.పూర్తి, సురేఖ, పద్మజ పాల్గొన్నారు.

మదర్ థెరిసా...

పలాస: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో పలాస మదర్ థెరిసా ప్రయివేటు పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 అక్షరాల రూపంలో కూర్చున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, ఇన్‌ఛార్జి ప్రసాదరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కవిటి : ఇస్రో, ఇండియా రూపంలో కూర్చొన్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న 'విశాఖ' విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న 'కాకినాడ ఆదిత్య' విద్యార్థులు

అప్పుల బాధతో ఉపాధ్యాయుడు ఆత్మహత్య

విజయానంద్ (ఫైల్)

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అప్పులబాధ తాళలేక ప్రభుత్వ ఉపాధ్యాయుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తొలుసూరుపల్లికి చెందిన హనమంతు విజయానంద్ (56) స్థానిక అంబేద్కర్ కూడలి సమీపంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఈయన తిరిగి చేరలేదు. అయితే గురువారం గ్రామం సమీపంలోని ఓ మఠం ఎదురుగా ఉన్న పొలాల్లో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు చూసి పరిశీలించారు. ఉపాధ్యాయుడు విజయానంద్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న టెక్కలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద పురుగుల మందు సీసా, మద్యం సీసా, గ్లాసు, చేతిసంచి కూడా ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. అయితే ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలే కారణమని పోలీసులు తెలిపారు. సుమారు రూ.20 లక్షల వరకు అప్పు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య రాధ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ తలగాన నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వయంశక్తి సంఘాలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాలకు వైసీపీ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకర రావు అన్నారు. గురువారం మండలంలోని శ్రీనివాసచార్యుల పేటలో మహిళా స్వయం శక్తి సంఘాలతో ఏర్పాటైన మహిళా పరస్పర సహాయ సహకార గ్రామ సంఘాన్ని 1995 చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తమ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం కార్యాలయాన్ని మండల మహిళా సమాఖ్య కార్యదర్శి బొడ్డేపల్లి వేణమ్మ ఆధ్వర్యంలో మహిళలకు అప్పగించారు. ఈ గ్రామ సంఘంలో 56 స్వయం శక్తి సంఘాలలో 615 మంది సభ్యులుగా ఉన్నారు. ఇందులో 48 సంఘాలు ఏ గ్రేడ్ లోనూ, 7 సంఘాలు బి గ్రేడ్‌లోనూ, 1 సంఘం సీ గ్రేడ్‌లోనూ ఉన్నాయి . ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ, ప్రస్తుతం శత శాతం తీసుకొన్న రుణాలను తిరిగి చెల్లిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకొని, అర్హులంతా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో ఆర్డినేటర్ సుభద్రతోపాటు ,గ్రామ సంఘం ప్రతినిధులు వెంకటరత్నం, శ్యామల, లత, ఇందుమతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : అలమాజీపేట వద్దనున్న పట్టణ ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రానికి విద్యుత్ అంతరాయం వల్ల పట్టణంలో శుక్రవారం నీటి సరఫరా జరగదని మునిసిపల్ కమిషనరు ఎం.రవిసుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం వర్షానికి చెవ్వాకులపేట సమీపంలో విద్యుత్ వైర్లపై తాటిచెట్టు పడిపోవడంవల్ల విద్యుత్ స్థంభాలు నేలకొరిగి సరఫరాలో అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. పట్టణంలో ఉదయం తాగునీటి సరఫరా ఉండదని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. వీలైనంత త్వరితగతిన సేవలు పునరుద్ధణకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

కెమెరాను అందజేస్తున్న ఎస్‌పి రాధిక

పిఆర్ఒ విభాగానికి నూతన కెమెరా

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పోలీసు కార్యాలయం పోలీసు పిఆర్ఒ ఎం.భాస్కర్‌కు సెక్షన్‌కు నూతన ఫొటో కెమెరాను ఎస్‌పి జి.ఆర్.రాధిక గురువారం అందజేశారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కెమెరా పనిచేయుడం లేదని ఇటీవల ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌పి స్పందించి రెండు రోజుల్లో కెమెరాకు అవసరమైన నిధులు తక్షణమే మంజూరు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ కెమెరా జిల్లా పోలీసు కార్యకలాపాలకు సక్రమంగా ఉపయోగించి జిల్లా పోలీసుశాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో చేరేలా మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ ఉమామహేష్, ఫొటోగ్రాఫెర్లు టి.రాము, పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న తిరుమల చైతన్య

ఉత్తమ ఫలితాలకు ప్రణాళికలు అవసరం

ప్రజాశక్తి- బూర్జ

ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అందుకు తగ్గ పరిణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ డిఇఒ తిరుమల చైతన్య అన్నారు, మండలంలోని అప్పల పట్నాయిక్ పేట పంచాయతీ కె.కె.రాజపురం ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని తెలిపారు అంతకుముందు తరగతులను, విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్‌ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న సన్యాసినాయుడు

ట్రాన్స్‌జెండర్లపై వివక్ష వద్దు

న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో ట్రాన్స్‌జెండర్లపై ఎటువంటి వివక్షత చూపవద్దని, సాధారణ పౌరుల తరహాలోనే వారిని జీవించే స్వేచ్ఛను అందించాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు వారు అందుకునేందుకు వీలుగా వారికి వికలాంగులశాఖ ఆధ్వర్యాన ధ్రువీకరణ పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందుకోవడంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని పరిష్కరించుకునేందుకు ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వికలాంగులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.అనురాధ, గృహ నిర్మాణశాఖ పీడీ నక్క గణపతిరావు, బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, న్యాయవాది ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

600 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పురుషోత్తంపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. షీలా కంటి ఆసుపత్రి సౌజన్యంతో పాఠశాల హెచ్‌ఎం వై. లత అధ్వర్యంలో 600 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా కంటి జాగ్రత్తలుపై విద్యార్థులకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బందం దేవరాజు, రాజ్ గోపాల్, సత్యవాణి, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల చట్ట సవరణ చేయొద్దు

ఎచ్చెర్ల: రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు కేటాయించిన భూములు ఆక్రమణదారుల కబంద హస్తాల్లో చిక్కుకుని ఉన్నాయని, వారికి మేలు చేసేందుకే ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టసవరణకు ఆర్డినెన్స్‌ను తీసుకొస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. మండలంలోని తమ్మినాయుడిపేట దళితవాడను గురువారం సందర్శించి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందుకు ఈ ఆర్డినెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఎకరాల భూములు దళిత, బడుగు బలహీనవర్గాల వారికి ఏడు దశాబ్దాల పాటు పాలించిన ప్రభుత్వాలు పంపిణీ చేశాయని అన్నారు. అందులో 9 లక్షల ఎకరాల భూములు ప్రస్తుతం అన్యాక్రాంతమై ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయన్నారు. అన్యాక్రాంతమైన భూములు తిరిగి పేదలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాల వారికి భూమి నుంచి దూరం చేయడానికే అసైన్డ్ భూముల చట్టసవరణ ఆర్డినెన్స్‌ను తీసుకొస్తుందని అన్నారు. ఈ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా భవిష్యత్‌లో నిర్వహించనున్న పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.తరుపతిరావు, రాకోటి రాంబాబు, రాకోటి చిన్నారావు, రామారావు, కృష్ణారావు, రామకృష్ణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్లను అందజేస్తున్న సింహాచలం

ప్రజా ప్రగతి కోసమే సైన్స్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజల కోసం ప్రగతి కోసమే సైన్స్ అని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. గురువారం పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, ఎల్ ఎన్ పేట మండలాల జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు, సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే వేదిక ముఖ్య ఉద్దేశమని అన్నారు. అప్పట్లో శాస్త్రీయ సమాజ నిర్మాణానికి అవరోధంగా ఉన్న నిరక్షరాస్యతను నిర్మూలించాల్సిన అవసరాన్ని గుర్తించి బాధ్యతతో లక్షలాది స్వచ్ఛంద కార్యకర్తలను తయారు చేసి కళా జాతాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడం జరిగిందన్నారు. పురాణ కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ ఉందంటూ ప్రజలను నమ్మించాలని చూస్తున్నారని, రుజువు లేని అశాస్త్రీయ అంశాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ నిజమైన సైన్స్ ప్రజల ప్రగతికి ఎలా దోహదం చేస్తుందో జన విజ్ఞాన వేదిక ద్వారా ప్రచారం చేయడమే లక్ష్యం అని అన్నారు. చంద్రయాన్ 3 విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు జన విజ్ఞాన వేదిక తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహన రావు, సహ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధన్ రావు, డివిజన్ గౌరవాధ్యక్షులు హెచ్. వి. సత్యనారాయణ, డివిజన్ కార్యదర్శి బొడ్డేపల్లి ప్రకాశరావు, డివిజన్ కోశాధికారి కె. షణ్ముఖరావు, నాయకులు బెండి సూర్యనారాయణ, అరినేని కష్ణారావు, కూన శ్రీనివాసరావు, పొన్నాడ పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

రేపు వికలాంగుల జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : ఈ నెల 26న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనాశాఖ, వికలాంగుల సంక్షేమ శాఖలు సంయుక్తంగా జిల్లాలోని వికలాంగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికలాంగుల శాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ కేడర్లలో నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. పది నుంచి పిజి వరకు ఏదైనా విద్యార్హత కలిగి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన నిరుద్యోగులైన వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6301045132, 6301275511 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పలాసలో భారీ వర్షం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం వరి పొలాలకు సాగునీరు అందకపోవడంతో వీట్లు వారిపోయాయి. మరో వైపు సాగునీరు సకాలంలో రాకపోవడంతో వర్షం వైపు రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ రోడ్లు వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో మురుగు కాలువలో ఉన్న చెత్తా చెదారం రోడ్లపై ప్రవహించింది. దీంతో పట్టణ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

డీలర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

సోంపేట: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిపి నిమ్మన దాసు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. అలాగే రేషన్ సరుకుల పంపిణీలో డీలర్లు తమ పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, డిటి కూర్మారావు, డీలర్ల సంఘ మండల అధ్యక్షుడు సాన షణ్ముఖరావు, డీలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఆర్‌పి వెంకటరమణ

పడ్డలో గ్రామసభ

మెళియాపుట్టి: మండలంలోని ఇటీవల చేపట్టిన ఉపాధి హామీ, ఐటిడిఎ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించి చేసిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించి తనిఖీలు చేపట్టామని ఎస్ఆర్‌పి వెంకటరమణ తెలిపారు. మండలంలోని పడ్డలో సర్పంచ్ రామచంద్ర మజ్జి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించడానికి గ్రామసభ నిర్వహించామన్నారు. అనంతరం తనిఖీ నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణరెడ్డి, డిఆర్‌పి నాయుడు, కార్యదర్శి అప్పారావు, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణారావు, క్షేత్ర సహాయకులు రాజు, తిరుపతి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

రణస్థలం: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ అన్నారు. మండలంలోని నెలివాడ ఆర్డర్ స్కూల్ విద్యార్థులకు అగ్నిప్రమాదాలు, గ్యాస్ మంటలు, ఎలక్ట్రికల్ మంటలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికార సిబ్బంది డెమో నిర్వహించి గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డర్ స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది, లీడింగ్ అగ్నిమాపక అధికారి బలగ ప్రసాద్, కానిస్టేబుళ్లు ఎన్.రామకృష్ణ, కె.రాంబాబు, జి.రామలక్ష్మణ, డిఒపి గంగరాజు, రవికుమార్, వెంకటరావులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి అశోక్

రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ భూషణరావు

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

నిబద్ధతతో సేవలందించే ప్రతి ఉద్యోగికీ సమాజంలో గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల సరుబుజ్జిలి ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అన్నారు. కళాశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన అధ్యాపకుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైస్ ఎంపిపి గోవింద వెంకట శివానందమూర్తి (బాబు) పాల్గొన్నారు. పద్నాలుగేళ్ల పాటు కళాశాలలో సేవలందించి గ్రామ ప్రజల్లోనూ, అధికారుల్లో సౌమ్యునిగానూ, కార్యదక్షత గల అధ్యాపకునిగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్ గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. తమ ప్రాంత విద్యార్థులంతా రాంప్రసాద్ చేసిన సేవలను గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. స్థానిక దుబ్బులపేటకు చెందిన గణపతి, ధనుంజయ రావు అంచెలంచెలుగా ఎదిగిన తీరును ఆయన ప్రశంసించారు. ఇదే కళాశాలకు మళ్లీ ప్రిన్సిపాల్‌గా రావాలని ఆకాంక్షించారు. రసాయనశాస్త్రం అధ్యాపకులు డి.చిన్నారావుది ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వమని ప్రిన్సిపాల్ గుర్తుచేసుకున్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన అధ్యాపకులను దుశ్శాలువలతో సత్కరించి, మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నూతన ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు, అధ్యాపకులు నాగేంద్ర, రామకృష్ణ, లైబ్రేరియన్ రామారావు, కృష్ణమూర్తి వినోద్‌రాజు, శ్రీనివాసరావు, విజయ, విజయ్, గౌతమి, సంగీత, తారాచంద్, ఆఫీస్ సిబ్బంది కమలాకరరావు, ఢిల్లీరావు, ఆర్‌పి ఫౌండేషన్ బాన్న బాలు, దవిళి సింహాచలం పాల్గొన్నారు.

కవిటి: ఉద్యోగికి విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని బొరివంక సర్పంచ్ బెందాలం శ్రీరాంప్రసాద్, కుసుంపురం మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు అన్నారు. బొరివంక, కుసుంపరం జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసి ఇటీవల బదిలీ అయిన 8 మంది ఉపాధ్యాయులకు గ్రామసు_లు, సంఘం సభ్యులు ఘనంగా సన్మానిం చారు. ఎంపిటిసి దుద్ది సతీష్, పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, గ్రామస్తులు బల్లెడ జయప్రకాష్, లోళ్ల కింగ్, మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్‌ను అందజేస్తున్న రాజ్యలక్ష్మి

'ఆహా' క్యాంటీన్ ప్రారంభం

ఇచ్ఛాపురం : మెప్మా అధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్ ద్వారా మహిళ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని లాలపేట వద్ద కమిషనర్ రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే స్టేషన్, బస్టాండ్, ఆస్పత్రి ఏరియా ప్రాంతాల్లో ప్రజలు రద్దీ ఉంటారని, ప్రజలకు తక్కువ ధరకు రుచికరమైన ఆహారం అందించాలని ఉద్దేశంతో ఆహా క్యాంటీన్ ఏర్పాటు చేశామని చెప్పారు. సాయిరాం సంఘం సభ్యులు పర్రి మోహని ఆహా క్యాంటీన్ నడుపుతూ తన జీవనోపాధి అభివృద్ధి చేసుకోవాలన్నారు. అలాగే ప్రజలకు రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ భారతిదివ్య, మెప్మా అధికారి జానకిరామారావు, భాస్కర్, వినాయక స్వయంశక్తి సంఘం సభ్యులు, సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆందోళన

పొందూరు: కళాశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం ఆందోళన చేపట్టారు. కళాశాలలో గతంలో ఫీజు చెల్లించినా రసీదులు పూర్తిగా ఇవ్వకుండా మరలా ఫీజులు కట్టాలంటూ వేధిస్తున్నారని అన్నారు. గతంలో ప్రిన్సిపాల్ సూచనల మేరకు తాత్కాలికంగా పనిచేసే విజయ్ అనే ఉద్యోగికి రూ.4 వేలు ఫీజుల కింద చెల్లించామని తెలిపారు. కానీ, తాము రూ.1,850 మాత్రమే చెల్లించినట్లు చూపిస్తున్నారని, మరో రూ 2.100లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. అలాగే హాజరు తక్కువగా ఉందని, రూ.వెయ్యి ఇస్తే పూర్తి స్థాయిలో హాజరు ఉండేలా చూస్తామంటున్నారని అన్నారు. దీనిపై ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్ టిసి ఇచ్చేస్తామని బెదిరిస్తున్నారని, క్రమశిక్షణలేదని నిందలు వేస్తున్నారని పేర్కొన్నారు. కళాశాలల్లో కనీస వసతులు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని, ఫీజులు వసూలులో తేడాలు ఉంటే సరిచేస్తామని పేర్కొన్నారు.

సిసి రోడ్డు పనులు పరిశీలన

పలాస : గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని, ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ తెలిపారు. మండలంలోని వీరభద్రాపురంలో నిర్మాణం చేపడుతున్న సిసి రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే బ్రాహ్మణతర్ల, అమలకుడియా పంచాయతీల్లో సిసి రోడ్లు, కాలువ పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి పంచాయతీలోనూ సిసి రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొర్ల మురళీకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవికుమార్, బి.కుమార్, కె.హరినాథ్, బి.భీమారావు, పైల కృష్ణారావు, పైల జనర్ధానరావు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న సాయికృష్ణ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు

ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

ప్రజాశక్తి- జి.సిగడాం

గ్రామాల్లో ఉన్న సమస్యలన్నీ గ్రామ నాయకులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సూచించారు. జి.సిగడాం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలని అన్నారు. సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన పనులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ఇంటింటికీ కొళాయిలు శరవేగంగా గ్రామాల్లో వేయాలని,గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమ పనులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జి. సిగడాం మండలం ఎంపీపీ ప్రతినిధి మీసాల వెంకటరమణ, జడ్పిటిసి కాయల వెంకటరమణ, జె.సి.ఎస్. ఇంచార్జ్ డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, జి.సిగడాం మండలం ఎంపీడీఓ నిశ్చల, తహసిల్దార్ పప్పల వేణుగోపాల్, హౌసింగ్ డీఈ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, జి.సిగడాం మండలం సర్పంచ్లు,ఎంపీటీలు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సచివాలయం సిబ్బంది,గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

రణస్థలం రూరల్: రణస్థలం మండలం వల్లభరావుపేట గ్రామానికి చెందిన దువ్వాన రమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వైఎస్సార్ బీమా పథకం కింద రూ. 5 లక్షలు బీమా వర్తిస్తుందని, ఈ పథకం కింద తక్షణ ఆర్థిక సహాయం రూ.10 వేలు ఆయన భార్యకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతులు మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రణస్థలం మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జేసీఎస్ ఇంచార్జ్ చిల్ల వెంకటరెడ్డి, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తోటాడలో విద్యుత్ మరమ్మతులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

వైర్లను మారుస్తున్న సిబ్బంది

మండలంలోని తోటాడ పంచాయతీలో కొన్ని ఏళ్లగా విద్యుత్ మరమ్మతులతో నిరంతరం అంతరాయం కలుగుతుందని సర్పంచ్ యర్నానాగుల సునీత ఇటీవల ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జి దువ్వాడ వాణికు వినతిపత్రాలు అందజేశారు. ఈ మేరకు వారు విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడారు. విద్యుత్శాఖ ఎఇ శివకుమార్ ఆధ్వర్యాన తన సిబ్బందితో నూతన స్తంభాలు, వైర్లను గురువారం మార్పు చేశారు. దీంతో శాశ్వత పరిష్కారం కావడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి యర్నానాగుల రామరాజు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన ఎపి శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సలహా మేరకు మండలంలోని కొజ్జిరియాలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు 155 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే 62 మందికి హెచ్ఐవి, 36 మందికి ఇసిజి, 45 మందికి సికెడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ నీల, ఎంపిటిసి కె.దశరథరావు, డాక్టర్లు ఎం.కోటి, ఎం.పల్లవి, ఎంఎల్హెచ్పి పార్థసారథి, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం జిల్లా రిసోర్స్ పర్సన్ హెచ్.నాగభూషణరావు, జోనల్ సూపర్వైజర్ పి.సుధాకర్, క్లస్టర్ లింక్ వర్కర్ జి.రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్యపు హక్కుపై వినతి

ప్రజాశక్తి- కవిటి

ఐదు దశాబ్దాలకుపైగా తమ ఆధీనంలో ఉన్న భూములు రీ సర్వేకు అధికారులు సహకరించి ఆ భూములపై తమకు యాజమాన్యపు హక్కులు కల్పించాలని కవిటి మండలం చండిపుట్టుగ గ్రామానికి చెందిన రైతులు తహశీల్దార్ శేఖర్ ను కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ నేతృత్వంలో రైతులు తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ 1970 సంవత్సరంలో చండిపుట్టుగ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 50లో ఒక్కొక్క సన్నకారు రైతు కూలీకి 0. 25సెంట్లు వంతున బీడు భూమి, వాటి ఫలసాయం అనుభవించేలా అధికారులు అనుమతులు మంజూరు చేశారు. తరువాత 1983లో రెవెన్యూ అధికారులు వీరి భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసి

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శేఖర్

వీరికి పూర్తిస్థాయిలో హక్కులు కల్పించారు. అయితే ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సమగ్ర భూ సర్వేలో ఈ భూమిని సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరించారు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ సంబంధిత పత్రాలతో రైతులు తహశీల్దార్కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ వై నీలయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, చండిపుట్టుగ రైతులు అప్పలస్వామి, నరసింహమూర్తి, లచ్చుమయ్య తదితరులు పాల్గొన్నారు.

బెంతులకు కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి

ఇచ్ఛాపురం :

వినతిపత్రం అందజేస్తున్న ఆదిరెడ్డి

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రత్తకన్నలో నివసిస్తున్న బెంతు ఒరియాలకు కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ఉద్యోగాలకు, పై చదువులకు వెళ్లలేక యువకులు నష్టపోతున్నారని వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ గురుప్రసాద్ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన వార్డులో కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాలకు కుల ధ్రువీకరణ పత్రం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ సమస్య పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. అలాగే అర్హత ఉండి కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని చెప్పారు. తక్షణమే స్పందించి కులధ్రువీకరణ పత్రం అందజేయాలని కోరారు.

జాతీయ మహాసభలను

విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

న్యూఢిల్లీలో సెప్టెంబరు 30, అక్టోబరు 1న అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం 9వ మహాసభలు నిర్వహిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా మహిళా నాయకులు కోనారి ఈశ్వరమ్మ, మద్దిల తులసమ్మ, పోతనపల్లి సుందరమ్మ, మద్దిల వరలక్ష్మి చంద్రమ్మలు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ సూదికొండ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమన్యాయం, సమానత్వం కోసం మహిళా పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా మహిళా లోకం ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, సిమ్మయ్య పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలతో ఆందోళన చేస్తున్న రైతులు

రైతుల ఆందోళన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలో రొట్టవలస పంచాయతీ పరిధిలోని అవతారాబాద్, కటకమయ్యపేట, తమ్మినాయుడుపేట గ్రామాల పరిధిలో ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష సర్వే అధికారుల వైఫల్యంతో తప్పులు, తడకలుగా నమోదయ్యాయని రైతులు వాపోయారు. ఈ మేరకు రొట్టవలస గ్రామ సచివాలయం వద్ద గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధికారులు చేపట్టిన డ్రోన్లతో చేపట్టిన సర్వే తప్పులు, తడకలుగా నమోదయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే, ఖాతా నెంబర్లు అటు, ఇటుగా నమోదయ్యాయని లబోదిబోమంటున్నారు. 200 ఎకరాల్లో మొత్తం తప్పులు దొర్లాయని వివరించారు. సచివాలయ వీఆర్ఒ, సర్వేయర్ నిర్లక్ష్య ఉదాసీన వైఖరి వల్లే ఈ దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సర్వే సక్రమంగా చేపట్టి న్యాయం చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా సర్వేయర్ ఎడి విజయకుమార్ను వివరణ కోరగా, ఏమైనా సమస్యలు ఉంటే తహశీల్దార్ను సంప్రదించాలని చెప్పడంపై రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

లింగరాజును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

ముగిసిన యోగా శిక్షణ

టెక్కలి : విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగ సాధన ఎంతో అవసరమని యోగా గురువారం లింగరాజు గురూజీ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మూడు రోజు యోగా శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడిటేషన్, యోగా తరగతులు నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక ప్రవర్తన మార్పులు చెందాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతో పాటు ఇతర అంశాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. అనంతరం లింగరాజుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేవల సతీష్కుమార్, అధ్యాపకులు ఎ.రామారావు, కసవయ్య, పి.డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం

బాల్యవివాహ రహిత సమాజానికి విద్యార్థులు తమవంతు సహాయం చేయాలని కోస్ట సచివాలయం మహిళా పోలీస్ అమ్మోజి బమ్మిడి కోరారు. పల్లెపేట జెడ్పీహైస్కూల్లో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు, బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి మానవహారం ఏర్పాటు చేశారు. బాల్యవివాహ రహిత సమాజానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారత దేశ వైజ్ఞానిక సత్తా విశ్వానికి చాటి చెప్పిన చంద్రయాన్-3 విజయం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బ్రెడ్స్ సంస్థ సభ్యురాలు ఎల్.తేజశ్రీ, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహ అనర్థాలపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎటిఎం మోడల్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని కొండములగం పంచాయతీ ముక్తుంపురం గ్రామంలో పోతురాజు రాజు పొలంలో కూరగాయలు పంటలతో ఎటిఎం మోడల్ వేయించడం జరిగిందని ఎన్డిఎ (మోడల్ మేకర్) జి.రాంబాబు తెలిపారు. గురువారం ఎటిఎం మోడల్లో ఒక బెడ్ వెడల్పు నాలుగడుగులు మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకొని ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్లపై దుంప జాతి అయిన ముల్లంగి, క్యారెట్, బీట్రూట్ , కాయగూరలైన వంగ టమోటా, బెండ, చిక్కుడు, మిరప, ఆకుకూరలైన తోటకూర, గోంగూర, పాలకూర, జొన్న, సజ్జ తదితర పంటలు నిర్ణీత కొలతల ప్రకారం వేసుకుంటే 365 రోజుల దిగుబడి పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి .సత్యనారాయణ (మోడల్ మేకర్),ఎసిఆర్ పోతురాజు రాజు, పి.మోహన్ రెడ్డి ,అప్పలనాయుడు రైతులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా చేపేనపేట గ్రామంలో 20 ఎకరాల కాంపాక్ట్ బ్లాక్లో బహుళ పంటల సాగును ప్రకతి వ్యవసాయ ప్రాజెక్టు సిబ్బంది చేపట్టారు. వరి పొలం గట్లపై కంది, బంతి, బొప్పాయి, అరటి, కొబ్బరి, మునగ మొక్కలను వేశారు . కాంపాక్ట్ బ్లాక్ లో ఉన్న రైతుల పొలం గట్లపై వేసుకున్న పలు రకాల కూరగాయల సాగుతో వారి కుటుంబ అవసరాలకు సరిపడా కూరగాయలు లభిస్తున్నాయన్నారు. యూనిట్ ఇన్చార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ రాజీలేని సూత్రాలు పాటిస్తూ రైతులతో క్షేత్రస్థాయిలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. అందుకే ఆ ఫలితాలు లభిస్తున్నాయన్నారు.

'జెల్' సేవలు విస్తృతం

అదనపు ఎస్పి విఠలేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిస్వార్థంగా సేవలందిస్తున్న జెల్ ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలని అదనపు ఎస్పి (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు అన్నారు. గురువారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెల్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రతినిత్యం చూస్తున్నానని, సేవలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెల్ ఫౌండేషన్ అధ్యక్షులు సత్యసాయి, వైస్ ప్రెసిడెంట్ జాడ సాయిలను అభినందించారు.